సాక్షి
పెద్దపల్లి
ఆదివారం । 18 । ఆగస్టు । 2024

మాఫీ సరే.. భరోసా ఏది?

- చివరి దశకు చేరిన వరినాట్లు .. ఊసేలేని రైతుభరోసా
- పెట్టుబడులకు ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు
- ప్రభుత్వ సాయం కోసం రైతుల ఎదురుచూపులు



సాక్షి, పెద్దపల్లి: వానాకాలం వరి నాట్లు చివరి దశకు చేరుకున్నాయి. సాగు పెట్టుబడి సాయం ఇంకా అందలేదు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ సర్కార్ మూడు విడతల్లో రూ.2లక్షల లోపు రుణాలు మాఫీ చేసింది. కానీ, వివిధ కారణాలతో చాలామంది రుణాలు మాఫీ కాలేదు.

మూడు విడతలు.. 51వేల ఖాతాలు..

జిల్లాలోని 51,393 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో మూడు విడతల్లో రూ.375.58 కోట్ల రుణమాఫీ సొమ్ము జమచేశామని ప్రభుత్వం చెప్పినా.. అర్హులందరికీ మాఫీ కాలేదు. మరోవైపు.. పెట్టుబడి సాయానికి అందించే రైతుభరోసాపై ఇప్పటివరకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయడంలేదు. దీంతో పెట్టుబడుల కోసం రైతులు ప్రైవేట్ వ్యాపారుల చుట్టూ తిరుగుతున్నారు.

అధికారంలోకి వచ్చిన వెంటనే..

తాము అధికారంలోకి రాగానే ఏడాదికి ఎకరాకి రూ.15వేలు, రైతుకూలీలకు రూ.12వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ గత ఎన్నికల్లో ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన కొత్తలో.. అంటే గత యాసంగిలో పాత పద్ధతిలోనే 1.46లక్షల మంది రైతులకు రూ.136కోట్ల పెట్టుబడి సాయం అందించింది. వానాకాలం నుంచి ఎకరాకు రూ.15వేల చొప్పున పెట్టుబడిసాయం అందజేయాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా రైతుభరోసా పథకం విధివిధానాలు ఖరారు చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది.

సమావేశాలు ముగిసినా..

గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధులో అనేక తప్పిదాలున్నాయని భావించిన కాంగ్రెస్ సర్కార్.. దానిని రైతుభరోసాగా మార్చింది. కొత్తపథకం విధివిధానాలపై మంత్రివర్గ ఉపసంఘం జూలై 15లోగా నివేదిక సమర్పించాలని సూచించింది. దీనికి అనుగుణంగా ఉమ్మడి జిల్లాల స్థాయిలో మంత్రులు ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. రైతులు, కూలీల అభిప్రాయాలను సేకరించారు. పథకంలో మార్పులు తేవాలని, ఐదెకరాల్లోపు రైతులకు పథకం వర్తింపజేయాలని మరికొందరు, 10ఎకరాలను కటాఫ్‌గా పెట్టాలని, రాజకీయనేతలు, ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వొద్దని వివిధ వర్గాలు తమ అభిప్రాయాలు తెలియజేశాయి. మంత్రివర్గ ఉపసంఘం అందించిన నివేదికను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాల్సి ఉండగా, రైతుభరోసాపై ఎలాంటి చర్చలేకుండానే సమావేశాలు ముగిశాయి. దీంతో ఈ సీజన్‌కు రైతుభరోసా అమలుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సాగుకు యోగ్యం కానివాటికి..

రహదారులు, గుట్టలు, సాగుయోగ్యం కాని భూములు, వెంచర్లుగా మారిన వాటికి పథకం రైతుభరోసా వర్తింపజేయ వద్దని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. ఈమేరకు వాటి గుర్తింపునకు సర్వే ప్రారంభించింది. రెండు నెలలుగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సాగులో ఉన్న భూములు, నో క్రాప్ ఏరియా గుర్తింపు సర్వే కొనసాగుతోంది. దీనిపై డీఏవో ఆదిరెడ్డిని వివరణ కోరగా ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వస్తే అందుకు అనుగుణంగా రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమజేస్తామన్నారు.

రుణమాఫీ వివరాలు

విడత	ఖాతాలు	సొమ్ము (రూ.కోట్లలో..)
తొలి	29,724	149.42
రెండో	13,401	124.41
మూడో	8,268	101.75

మాఫీకాలే.. సాయమందలే



నాకు రెండున్నరెకరాలు ఉంది. లక్ష రూపాయాలు పంట రుణం తీసుకున్న. ప్రభుత్వం మూడువిడతల్లో రుణమాఫీ చేసినా.. నాకు మాఫీ కాలే. సార్లను అడిగితే ఆధార్ నంబర్ తప్పుగా ఉందంటున్నరు. ఇటు రుణమాఫీ కాలే.. పెట్టుబడి సాయం రాకపాయె. రైతుభరోసా ఇవ్వకపోవడంతో ఇబ్బందిగా ఉంది.

– కూకట్ల లింగయ్య, కాట్నపల్లి

ఇబ్బందవుతుంది



నాకు ఎకరం ఉంది. దానిమీద పంటరుణం రూ.58వేలు తీసుకున్న. తీరా రుణమాఫీ జాబితాలో నాపేరు లేదన్నరు. అధికారులను అడిగితే రేషన్ కార్డులేదని, త్వరలో మాఫీ చేస్తామంటున్నరు. భూమి ఉండి సాగు చేయని వారికి మాఫీ అయ్యింది. మాలాంటి సాగుచేసే వారికి మాఫీ కాలేదు. కనీసం రైతుబంధు ఇచ్చినా కొంత ఆసరాగా ఉంటుంది.

– తాడవేణి శ్రీనివాస్, కదంబపూర్

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు టాస్క్‌ఫోర్స్

- కబ్జాలపై 94914 79020 నంబర్‌కు ఫిర్యాదు చేయండి
- కలెక్టర్ కోయ శ్రీహర్ష



కేజీబీవీలో సౌకర్యాలు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు కలెక్టర్ అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటైంది. పలు శాఖలకు చెందిన అధికారులు సభ్యులుగా ఉండే ఈ కమిటీ దృష్టికి ఆక్రమణల విషయాన్ని తేవాలనుకునే వారు 94914 79020 నంబరుకు ఫిర్యాదు చేస్తే సత్వరమే స్పందిస్తారని కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. ఈ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలనుకునే వారు dropeddapalli@gmail.com వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ భూములు, చెరువులు, శిఖం, కుంటలు కబ్జాదారుల చెరలో ఉన్నట్లు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే టాస్క్‌ఫోర్స్ స్వాధీనం చేసుకుంటుందన్నారు. అందులోని నిర్మాణాలు తొలగిస్తామని స్పష్టం చేశారు.

టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు వీరే..

టాస్క్‌ఫోర్స్ కమిటీలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్‌తోపాటు డీసీపీ, అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ), డీపీవో, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ, జిల్లా పంచాయతీరాజ్ ఈఈ, పెద్దపల్లి, మంథని ఆర్డీవోలు, ఆయా మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. కన్వీనర్‌గా కలెక్టరేట్ ఈ విభాగం సూపరింటెండెంట్ వ్యవహరిస్తారు.

కేజీబీవీని సందర్శించిన కలెక్టర్

రామగుండం: అంతర్గాం మండలం కుందనపల్లి కేజీబీవీని కలెక్టర్ శ్రీహర్ష తనిఖీ చేశారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ ఇటీవల కేజీబీవీని సందర్శించి అసౌకర్యాలు గుర్తించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ కేజీబీవీని తనిఖీ చేశారు. సౌకర్యాలపై ఆరా తీశారు. ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలిచ్చారు.

పట్టుదలతో చదవండి



మాట్లాడుతున్న డీఈవో మాధవి

మంథని: క్రమశిక్షణ, ప్రణాళికతో చదివి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని జిల్లా విద్యాధికారి మాధవి విద్యార్థులకు సూచించారు. కన్నాల ప్రభుత్వ పాఠశాలను శనివారం డీఈవో సందర్శిం పేరెంట్స్ మీటింగ్ పాల్గొన్నాడారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు నాటి సంరక్షించుకోవాలని ఆమె అన్నారు. ఉపాధ్యాయులు కానుగంటి శ్రీనివాస్, రాజు, రాధిక, సావిత్రి తదితరులు ఉన్నారు.

స్టెతస్కోప్ పక్కన పెట్టి.. ప్లకార్డు పట్టుకుని..

- కోల్‌కతా ఘటనపై ఆగ్రహావేశాలు
- గోదావరిఖనిలో భారీ ర్యాలీ – పెద్దపల్లిలో నిరసన



ర్యాలీలో ఐఎంఏ ప్రతినిధులు, ప్రొఫెసర్లు, మెడికోలు

కోల్‌సిటీ(రామగుండం): కోల్‌కతా ఘటనపై వైద్యులు కన్నెర్రజేశారు. పీజీ వైద్య విద్యార్థిని హత్యాచారంలో దోషులను కఠినంగా శిక్షించాలని నినదించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్(జీజీహెచ్)తోపాటు పలు ఆస్పత్రుల్లో శనివారం ఓపీ సేవలు నిలిపివేసి నిరసన చేపట్టారు. అత్యవసర సేవల కోసం వచ్చిన పేషెంట్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నినాదాల హోరు..

'ఓ నిర్భయ.. ఓ దిశ.. ఇప్పుడు అభయ.. ఇలాంటి ఘోరాలు ఇంకెన్ని? ఎన్నాళ్లు ఈ దారుణాలు? వి వాంట్ జస్టిస్' అని ప్లకార్డులు పట్టుకొని నినాదాలతో హోరెత్తించారు. వైద్యులు, ప్రొఫెసర్లు, మెడికోలు వారిని అనుసరించారు. హంతకులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్) ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు, నర్సింగ్ ఆఫీసర్లు ధర్నాలు, ర్యాలీలతో ఉద్యమ బాటపట్టారు. రామగుండం ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) వీరికి మద్దతు తెలిపింది. అందరూ కలిసి జీజీహెచ్ నుంచి గాంధీచౌక్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. చౌరస్తా నుంచి మళ్లీ మున్సిపల్ టీ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, రాజీవ్ రహదారిపై మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. అనంతరం జీజీహెచ్‌కు చేరుకుని అక్కడ బైఠాయించారు. డాక్టర్లకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రామగుండం ఐఎంఏ అధ్యక్షుడు దామెర అనిల్‌కుమార్, కార్యదర్శి క్యాస శ్రీనివాస్, జీజీహెచ్ ప్రొఫెసర్లు ఫరీద్‌మహ్మద్, రవివర్మ, స్వాతి, అశోక్, అనూష, హర్షిణి, సిమ్స్ జూడా అధ్యక్షుడు ప్రశాంత్ పాల్గొన్నారు.

పెద్దపల్లిలో వైద్యుల నిరసన

పెద్దపల్లిరూరల్: ఐఎంఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమాకాంత్, ప్రణీత్ ఆధ్వర్యంలో వైద్యులు జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రైవేట్ ఆస్పత్రులు మూసివేశారు. డాక్టర్లు వెంకటేశ్వర్‌రావు, మల్లేశం, విజయ, రోహిత్, కృష్ణారెడ్డి, రాజేశ్, స్వరూప్‌కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు. మెడికల్, డ్రగ్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాడూరి వినోద్ సంఘీభావం తెలిపారు. మాతాశిశు ఆస్పత్రి ఎదుట వైద్యులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.



ఐఎంఏ ఆధ్వర్యంలో పెద్దపల్లిలో చేపట్టిన ర్యాలీలో వైద్యులు

సమాజం ఖండించాలి



కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన అఘాయిత్యాన్ని యావత్ సమాజం ఖండించాలి. ఇప్పటివరకు సేవల్లో డాక్టర్లు నిర్లక్ష్యం వహించారని జరిగిన దాడులు చూశాం. కానీ, ఇప్పుడు మహిళా వైద్యురాలిని హత్యాచారం చేయడం దేశాన్నే కుదిపేస్తోంది. ఈ ఘటనపై సమాజం స్పందించాలి.

– దామెర అనిల్‌కుమార్, అధ్యక్షుడు, ఐఎంఏ

కఠినంగా శిక్షించాలి



డాక్టర్లకు పనిచేసే స్థలంలోనే రక్షణ లేదు. కోల్‌కతా ఘటనపై దేశవ్యాప్తంగా వైద్యులు, మెడికోలు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేస్తున్నారు. దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలి. ప్రభుత్వాలు స్పందించాలి. మహిళా వైద్యులు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో సేవలు అందించేలా చూడాలి.

– వైష్ణవి, మెడికో

ఫాస్ట్‌ట్రాక్ కోర్టు అవసరం



లైంగికదాడి సమయంలోనే నిర్భయ, దిశ అంటూ పోతున్నారు. దోషులపై కఠిన చర్యలు తీసుకోవడం లేదు. సేఫ్‌ప్లేస్ అని నమ్మి పనిచేస్తున్న ప్రాంతంలోనే లైంగిక దాడి జరిగిందంటే లా అండ్ ఆర్డర్ పరిస్థితి ఎలా ఉంది? దోషులెవరో తేలలేదు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు విచారణ జరపాలి. – అనూష, అసిస్టెంట్ ప్రొఫెసర్

డాక్టర్లను కాపాడేదెవరు?



ప్రజల ప్రాణాలను కాపాడేందుకు వైద్య వృత్తిలోకి వచ్చిన యువతిని అత్యాచారం చేసి దారుణంగా చంపేశారు. క్లూస్‌ను మాయం చేయడానికి లోకల్ గూండాలు ఆస్పత్రిలో విధ్వంసం సృష్టించారు. డాక్టర్లను ఎవరు కాపాడుతారు. సమాజం ఎందుకు చర్చించడం లేదు?

– ప్రశాంత్, మెడికో ప్రెసిడెంట్



- సోదరసోదరీమణుల అనుబంధానికి ప్రతీక
- పుట్టింటికి చేరనున్న ఆడబిడ్డలు
- అన్నదమ్ములకు రాఖీ కట్టి, మురిసిపోయే పండుగ

అనురాగ వారధి.. రాఖీ

అనురాగ వారధి రాఖీ పండుగ. జన్మనిచ్చిన అమ్మ.. జీవితాన్ని ఇచ్చిన నాన్నను తమ సోదరుల్లో చూసుకుంటూ సోదరీమణులు సంబరపడతారు. ఏటా శ్రావణమాసంలో పౌర్ణమి రోజు రాఖీని జరుపుకుంటారు. ఎంత దూరంలో ఉన్నా అన్నాదమ్ములను కలిసేందుకు ఆడబిడ్డలు పుట్టింటికి చేరి, రాఖీ కట్టి, తమకు రక్షణగా నిలవాలని కోరుతారు. సోదరులు వారికి అభయంతోపాటు చీరసారెలు, కానుకలు ఇస్తారు. విదేశాల్లో ఉన్నవారు కొరియర్ ద్వారా ఇక్కడికి, ఇక్కడివారు విదేశాలకు, ఇతర ప్రాంతాలకు రాఖీలను పంపుతారు. ఉమ్మడి జిల్లాలో పలు రాఖీ తయారీ కేంద్రాల్లో వివిధ డిజైన్లు అందుబాటులో ఉండగా.. గిరాకీ బాగుందని వ్యాపారులు చెబుతున్నారు. రేపు రాఖీ పండుగ సందర్భంగా ప్రత్యేక కథనం!!

ఏడాది పొడవునా రాఖీల తయారీ



రాఖీలు కొంటున్న వినియోగదారులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి రాఖీ తయారీ కేంద్రంలో ఏడాది పొడవునా రాఖీలు తయారు చేస్తున్నారు. ఇందుకు అవసరమయ్యే ముడిసరుకును పలు రాష్ట్రాల నుంచి తెప్పిస్తున్నట్లు యజమాని ఇల్లందుల కృష్ణమూర్తి తెలిపారు. దేశంలోని 15 రాష్ట్రాలతో పాటు అమెరికా, బ్రిటన్ వంటి దేశాలకు రాఖీలు ఎగుమతి చేస్తున్నారు. జరీ, స్పాంజ్, ఫ్యాన్సీ, కిడ్స్, స్టోన్, సిల్వర్, టాయ్, డోరీ తదితర రకాల రాఖీలు తయారు చేస్తున్నారు. పొరుగు రాష్ట్రాల వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ పది పైసల నుంచి రూ.150 వరకు రాఖీలు అందుబాటులో ఉన్నాయి. రూ.10 వేలకు మించి విలువ చేసే రాఖీలు కొనుగోలు చేస్తే ఫ్రీ డెలివరీ చేస్తున్నారు.

4 వేల మందికి ఉపాధి



మాది మంథని. 36 ఏళ్ల క్రితం గుమాస్తాగా పనిచేసి, పెద్దపల్లికి వచ్చి స్థిరపడ్డాను. తొలుత చిన్న చిన్న వ్యాపారాలు చేశాను. తర్వాత రాఖీ తయారీ కేంద్రాన్ని నెలకొల్పి, 4 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నాను. ఈ వ్యాపారం నాకు ఎంతో తృప్తినిస్తోంది.

– ఇల్లందుల కృష్ణమూర్తి, రాఖీ కేంద్రం నిర్వాహకుడు

హైదరాబాద్ నుంచి వచ్చా



నేను పెద్దపల్లిలో రాఖీ తయారీ కేంద్రం ఉందని తెలుసుకొని, హైదరాబాద్ నుంచి వచ్చాను. రాఖీలు రకరకాల డిజైన్లలో ఉన్నాయి. గతంలో కోల్‌కతా నుంచి తెప్పించేవాన్ని. ఇప్పుడు ఇక్కడి నుంచే తీసుకెళ్తున్న. – మోతీలాల్, వ్యాపారి

బీడీ పరిశ్రమకు ప్రత్యామ్నాయంగా..

సిరిసిల్లటౌన్: దశాబ్ద కాలంగా సిరిసిల్లలో రాఖీ పరిశ్రమ విస్తరించి ఉంది. తొలుత ఒక్కరు పరిశ్రమను స్థాపించగా ప్రస్తుతం పదుల సంఖ్యలో చిరు వ్యాపారులు రాఖీలను తయారు చేస్తున్నారు. జిల్లాతోపాటు కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలకు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. రాఖీల తయారీకి అవసరమైన ముడిసరుకును వ్యాపారులు ముంబయిలోని మల్లాడ్ ప్రాంతం నుంచి తీసుకువస్తున్నారు. రంగురాళ్లు, సిల్వర్, గోల్డెన్, దేవుళ్ల బొమ్మలు, వివిధ పార్టీల గుర్తులతో రాఖీలు తయారు చేయిస్తున్నారు. రూ.2 నుంచి రూ.100 వరకు ధరల్లో విక్రయిస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే ఇక్కడ బీడీ పరిశ్రమకు ప్రత్యామ్నాయంగా రాఖీ పరిశ్రమ నడుస్తోంది.



సిరిసిల్లలో తయారైన రాఖీలు

ఎనిమిదేళ్లుగా నిర్వహిస్తున్న



మేము ఎనమిదేళ్లుగా సిరిసిల్లలో రాఖీ పరిశ్రమ నిర్వహిస్తున్నం. ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు రాఖీలను ఎగుమతి చేస్తున్నాం. బ్రాండెడ్ రాఖీలతో పోల్చితే తక్కువ రేట్లు ఉండటంతో ఆదరణ లభిస్తోంది. – అవదూత శ్రీహరి, రాఖీ పరిశ్రమ నిర్వాహకుడు

విత్తన రాఖీలు..

సిరిసిల్ల టౌన్: సిరిసిల్ల గణేశ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మూడేళ్లుగా విత్తనాలతో రాఖీలు తయారు చేస్తున్నారు. వాటిని పిల్లలతో కట్టిస్తున్నామని టీచర్ వింధ్యారాణి తెలిపారు. సాధారణ రాఖీలను ప్లాస్టిక్‌తో తయారు చేస్తుండటంతో పర్యావరణం దెబ్బతింటుందని పేర్కొన్నారు.



విత్తన రాఖీలు ఇస్తున్న టీచర్ వింధ్యారాణి

తమ్ముడికి 79 ఏళ్లుగా కడుతున్న



ఇల్లంతకుంట(సిరిసిల్ల): నా పేరు రామవ్వ. వయసు 83ఏళ్లు. నాకు ఊహ తెలిసినప్పటి నుంచి 79 ఏళ్లుగా తమ్ముడు సాదుల ఆగయ్యకు రాఖీ కడుతున్న. ప్రతీ సంవత్సరం నా తల్లిగారి ఊరు ఇల్లంతకుంటకు నా కొడుకు శ్రీనివాస్ బండిపై తీస్కపోతడు. భర్త స్వాతంత్ర్య సమరయోధుడు వెంకటరాములు. నాకు ఇద్దరు తమ్ముళ్లయితే ఒకడు చనిపోయిండు. ఉన్న ఒక్క తమ్మునికి రాఖీ కడితే సంతోషంగా ఉంటది.

70 ఏళ్ల వయసు.. 5 కి.మీ. నడిచి వెళ్తూ



మల్యాల(చొప్పదండి): మండలంలోని సర్వాపూర్‌కు చెందిన సామల భాగ్యవ్వకు ఒక చెల్లెలు, తమ్ముడు ఉన్నారు. తల్లిగారి ఊరు గంగాధర మండలంలోని కొండయ్యపల్లె. భర్త గణపతి గతంలోనే చనిపోయాడు. కొండయ్యపల్లెలో ఉంటున్న తమ్ముడు గౌడ మల్లేశంకు ఏటా రాఖీ కడుతోంది. చాలా ఏళ్లుగా ఆ ఊరికి బస్సు నడవడం లేదని, ఏటా పండుగకు 5 కి.మీ. నడుచుకుంటూ వెళ్తున్నట్లు తెలిపింది. ఇప్పుడు ఆమె వయసు 70 ఏళ్లు. ఆదివారం నడుస్తూ వెళ్లి, తమ్ముడికి రాఖీ కడతానని పేర్కొంది.

రాఖీల బట్వాడా



బోయినపల్లి(చొప్పదండి): సుదూర ప్రాంతాల్లో ఉన్న తమ సోదరులకు ఆడబిడ్డలు పోస్టు ద్వారా రాఖీలు పంపి, సంతోషిస్తారు. ఎక్కువ శాతం హైదరాబాద్, బెంగళూరు, ముంబయి తదితర ప్రాంతాలకు పోస్టల్ సేవలు అందుబాటులో ఉన్నాయని కరీంనగర్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శివాజీ తెలిపారు. కరీంనగర్ పోస్టల్ డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 700కు పైగా రాఖీలను పంపించామని పేర్కొన్నారు.

చెల్లి రాక కోసం ఎదురుచూస్తా



వేములవాడ: అన్నాచెల్లెలి అనుబంధాన్ని బలోపేతం చేసే పండుగ రాఖీ. ఏటా ఎన్ని కార్యక్రమాలు ఉన్నా నా చెల్లి రాక కోసం ఎదురుచూస్తా. చిన్నప్పుడు తనతో ఆడుకున్న ఆటలు మరిచిపోలేను. ప్రజల ఆశీస్సులతో ఈసారి వేములవాడ ఎమ్మెల్యేగా గెలుపొందాను. జిల్లాలోని మహిళామణులకు పండుగ శుభాకాంక్షలు. – ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్

30 ఏళ్లుగా విక్రయాలు



వేములవాడ: 30 ఏళ్లుగా వేములవాడలో బుక్ స్టాల్ నిర్వహిస్తున్నాం. ఏటా రాఖీ పౌర్ణమికి నెల రోజుల ముందుగానే రాఖీలు తెప్పిస్తాం. అక్కాచెల్లెళ్లు దూర ప్రాంతాల్లో ఉన్న తమ సోదరులకు సకాలంలో పంపించే వీలుంటుంది. మాకు అదనపు ఆదాయం సమకూరుతోంది. – పైడ శ్రీనివాస్–స్వప్న

క్లుప్తంగా

ఆదివరాహస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కమాన్‌పూర్(మంథని): స్థానిక శ్రీఆదివరాహ స్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకుడు కలకుంట్ల వరప్రసాద్‌చార్యుల బృందం ఈ తంతు నిర్వహించింది. దేవాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి కల్యాణం తిలకించారు. ఈవో కాంతరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బాల్యమిత్రునికి ఆర్థికసాయం



సాయం అందిస్తున్న బాల్యమిత్రులు

రామగుండం: స్థానిక జెడ్పీ హైస్కూల్ 1986–87వదో తరగతి బ్యాచ్‌కు చెందిన లింగాపూర్ గ్రామస్తుడు గుండు కనకయ్య అనారోగ్యం బారినపడ్డాడు. ఆస్పత్రి ఖర్చులు, కుటుంబపోషణ భారంగా మారడంతో బాల్యమిత్రులు స్పందించారు. తలాకొంత పోగుచేసిన రూ.1.03 లక్షలను బాధిత కుటుంబానికి శనివారం అందజేశారు. కనకయ్య ఆరోగ్యం కుదుటపడాలని ఆకాంక్షించారు. మిత్రబృందం కందుల పోశం, సలీం, ఎం.శ్రీనివాస్, కందుల సత్యనారాయణ, అబ్దుల్ తఖీ, హఫీజ్, నర్సింగరావు, జోసెఫ్, మల్లేశ్, మొహినొద్దీన్, భూమేశ్, రవీందర్, సత్యనారాయణ, గట్టయ్య, శ్రీనివాస్, సారయ్య, మహ్మద్, ఉప్పల్‌రావు, వెంకటేశ్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

'బంగ్లాదేశ్‌లో దాడులు శోచనీయం'



ర్యాలీలో హిందూ ఐక్యవేదిక నాయకులు

గోదావరిఖని: బంగ్లాదేశ్‌లో మైనార్టీలుగా ఉన్న హిందువులపై దాడులు శోచనీయమని హిందు సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు అన్నారు. ఈమేరకు నగరంలో శనివారం బంద్ చేపట్టారు. గోదావరిఖనిలోని వ్యాపార కూడళ్లలో ర్యాలీ నిర్వహించారు. కల్యాణ్‌నగర్, రాజస్థాన్‌భవన్ నుంచి లక్ష్మీనగర్ ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. భారత ప్రభుత్వం జోక్యం చేసుకుని హిందువులకు రక్షణ కల్పించాలని కోరారు. వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, హిందూ వాహిణి, పలు కుల సంఘాలు, పార్టీల నాయకులు కోట రవీందర్, మహంకాళి స్వామి, సోమవారపు లావణ్య, కందుల సంధ్యారాణి, మేరుగు హన్మంతు, అయోధ్య రవీందర్, అడిగొప్పుల రాజు, తిరుపతి, సంపత్, రాజు, ఐలయ్య, బండారి రాయమల్లు, శ్రీధర్, కిశోర్, రాజేశ్‌శర్మ, ప్రశాంత్, మానస్, సునీల్, లాలాశర్మ, మేరుగు గట్టయ్య, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

- వర్షాలు పడుతున్నా తగ్గట్లే..
- తేమశాతం పెరగడమే కారణమంటున్న అధికారులు
- 22వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన ఉందన్న ఐఎండీ



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కొన్ని రోజులుగా ఉమ్మడి జిల్లా వాతావరణంలో అనూహ్య మార్పులు వస్తున్నాయి. ఓవైపు వానలు, మరోవైపు ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సాధారణంగా రోజూ వర్షం కురుస్తుంటే.. వాతావరణం దానంతట అదే చల్లబడుతుంది. కానీ, ఎంత వాన పడుతున్నా ఉక్కపోత మాత్రం తగ్గడం లేదు. ఫ్యాన్ టాప్ స్పీడ్‌లో పెట్టినా, కూలర్లు తిరుగుతున్నా, ఏసీలు పని చేస్తున్నా ఫలితం ఉండటం లేదు. రోజంతా చెమటతో ప్రజలు చికాకు పడుతున్నారు. మరోవైపు వాతావరణంలో మార్పుల వల్ల రోగ నిరోధక శక్తి దెబ్బతిని, జ్వరాల బారిన పడుతున్నారు.

19న అల్పపీడనం ఏర్పడే అవకాశాలు

బంగాళాఖాతంలో షియర్ జోన్ ఏర్పడిందని, దానివల్ల తెలంగాణలో వరుసగా వర్షాలు కురుస్తున్నాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. కొన్ని రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు కారణం ఇదేనని పేర్కొంది. అలాగే, ఈ నెల 19వ తేదీన బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలు ఉన్నాయని వెల్లడించింది. దీని ప్రభావంతో 18, 19, 20, 21, 22వ తేదీల్లో ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్లలో ఉరుములు, మెరుపులతో సాధారణం నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయంది. వాస్తవానికి వానల వల్ల వాతావరణంలో తేమశాతం సహజంగానే పెరుగుతుందని, దానివల్లే శరీర ఉష్ణోగ్రతలు పెరిగి, చెమటలు పడతాయని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఆరోగ్యానికి ముప్పు



వరుసగా కురుస్తున్న వర్షాలతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, నీటిగుంటల్లో నీరు చేరి, దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. సూర్యుడు కూడా రోజుల తరబడి రాకపోవడంతో దోమలు, వాటి సంతతి ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది. ఫలితంగా చికున్ గన్యా, మలేరియా, డెంగీ, వైరల్ ఫీవర్స్ పెరిగిపోతున్నాయి. విషజ్వరాలన్నీ పగలు కుట్టే దోమల వల్లే వస్తున్నాయి. వాతావరణంలో మార్పుల వల్ల శ్వాసకోస సంబంధిత న్యూమోనియాను నిర్మూలించేందుకు బలవర్ధక ఆహారం తీసుకోవాలి. రోజూ గుడ్డు తినాలి. వ్యాయామం చేయడం, పరిశుభ్రత పాటించడం, మాస్కులు ధరించడం చేయాలి.

– సాయిని నరేందర్, సివిల్ సర్జన్, పల్మనాలజిస్టు

విద్యతో వివేకం, విచక్షణ, వినయం

- సుల్తానాబాద్ మున్సిఫ్ కోర్టు జడ్జి గణేశ్
- విద్యార్థులకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న జడ్జి గణేశ్

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): విద్యతో వివేకం, విచక్షణ, వినయం, విజ్ఞానం, వికాసం, విజ్ఞత అలవడుతుందని, తద్వారా సమాజ రక్షణలో బాధ్యతగా వ్యవహరిస్తామని సుల్తానాబాద్ మున్సిఫ్ కోర్టు జడ్జి గణేశ్ అన్నారు. మల్యాల మోడల్ స్కూల్‌లో శనివారం చట్టాల(లీగల్ లిట్రసీ)పై శనివారం అవగాహన కల్పించారు. చదువుతోపాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోక్సో, మోటారు వెహికిల్, ఐపీసీ, సివిల్ ప్రొసీజర్ కోడ్‌పై వివరించారు. తల్లిదండ్రులు, గురువులు, పెద్దలు, తోబుట్టువులు, మహిళలు, బాలిలను గౌరవించాలని సూచించారు. వృద్ధాప్యంలోని తల్లిదండ్రుల పోషణ బాధ్యత వారి కుమారులు, కూతుళ్లదేనని అన్నారు. డ్రగ్స్, మత్తు పానీయాలు, గంజాయి వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, న్యాయవాదులు ఆకారపు సరోత్తమ్‌రెడ్డి, శ్రీరాములు, జె.రమేశ్, కె.అజయ్, ఎస్సై ఓంకార్‌యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖిల్లాను పర్యాటక కేంద్రంగా గుర్తించాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేశ్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న సురేశ్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని రామగిరిఖిల్లా ప్రాచీన చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోందని, దీనిని కాపాడేందుకు పర్యాటక కేంద్రంగా గుర్తించి ఉత్తర్వులు జారీ చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో ఖిల్లా వివరాలు వెల్లడించారు. కాకతీయుల కాలంలో రామగిరిపై నిర్మించిన రామగిరికోట కాకతీయ శిల్ప కళా సంపదకు, సాంస్కృతిక వైభవానికి చిహ్నంగా నిలుస్తోందని తెలిపారు. జిల్లా కేంద్రానికి 22కిలోమీటర్ల దూరంలోని ఖిల్లాను తిలకించేందుకు ఏటా శ్రావణమాసంలో సందర్శకులు వస్తుంటారన్నారు. రామగిరిఖిల్లా నుంచే కాళిదాసు మేఘదూత గేయ పద్యాన్ని రచించారన్నారు. రామాయణ కావ్యంలోనూ రామగిరి కోట ప్రస్తావన ఉందని వివరించారు. ఖిల్లా ఔషధ మొక్కలకు నిలయమన్నారు. అడవిని ఔషధ మొక్కల సంరక్షణ కేంద్రంగా ప్రకటించాలన్నారు. నాయకులు కట్కూరి సత్యనారాయణరెడ్డి, శ్రీధర్, కందుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేగంగా రామగుండం అభివృద్ధి

- పనులు త్వరితగతిన గ్రౌండ్ చేయాలి
- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- నగర ప్రగతిపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

కోల్‌సిటీ(రామగుండం): నగరాభివృద్ధి పనులను త్వరితగతిన గ్రౌండ్ చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి శనివారం ఆయన రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లోని గోదావరిఖని రమేశ్‌నగర్ మహాత్మా జ్యోతి బాపూలే బాలికల గురుకులాన్ని సందర్శించారు. విద్యార్థినుల ఇబ్బందులు పరిశీలించారు. గురుకులాన్ని మరో భవనానికి తరలించాలని ఆదేశించారు. పాత మున్సిపల్ కార్యాలయంలోని తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను గ్రౌండ్ చేయాలన్నారు. రహదారులు, డ్రైన్ల నిర్మాణానికి నిర్దిష్ట ప్రణాళిక రూపొందించాలని సూచించారు. బల్దియా ఆదాయం పెంచేందుకు కార్యాచరణ అమలు చేయాలన్నారు. ఆస్తిపన్ను బకాయిలను పూర్తిస్థాయిలో వసూలు చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం బల్దియా కార్యాలయంలో శానిటేషన్ వాహనాల ట్రాకింగ్ పనితీరు పరిశీలించారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్, ఎస్ఈ శివానంద్, ఈఈ రామణ్, రెవెన్యూ ఇన్‌చార్జి రాజలింగం పాల్గొన్నారు.

మూడు నెలల్లో పరిష్కారం

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం నగర పాలక సంస్థ 14వ డివిజన్ లక్ష్మీపురం గ్రామంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష పర్యటించారు. మొబైల్ యాప్ ద్వారా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిశీలించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి మూడు నెలల్లోగా పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ, కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్, అధికారులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగు పడాలి

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల విద్యాప్రమాణాలు మెరుగుపడాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో అంతర్గాం, పాలకుర్తి, రామగుండం మండలాల కాంప్లెక్స్ హెచ్ఎంలతో శనివారం కలెక్టర్ సమావేశమయ్యారు. ప్రతీవారం కాంప్లెక్స్ పరిధిలో కనీసం మూడు పాఠశాలలను తనిఖీ చేయాలన్నారు. డీఈవో మాధవి, అకడమిక్ అధికారి పీఎం షేక్ పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు..

ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. పరిష్కారానికి అనుసరించాల్సిన పద్ధతులపై తహసీల్దార్లకు సూచనలు చేశారు.

20 నుంచి ఇంటింటి సర్వే

ఈనెల 20 నుంచి అక్టోబర్ 28వ తేదీ వరకు ప్రీ రివిజన్ నిర్వహించి 29న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టర్లతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ పాల్గొన్నారు. 18 ఏళ్లు నిండి వారందరికీ ఓటుహక్కు కల్పించాలన్నారు. ఆర్డీవోలు గంగయ్య, హనుమా నాయక్ ఉన్నారు.

అగ్ని ప్రమాదంలో రూ.కోటి 80 లక్షల నష్టం

పెద్దపల్లిరూరల్: భోజన్నపేట గ్రామంలోని త్రివేణి రైస్‌మిల్లులో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.కోటి 80లక్షల విలువగల ధాన్యం, బియ్యం నిల్వలు మంటల్లో కాలిపోయాయని యజమాని కాసనగొట్టు శ్రీనివాస్ తెలిపారు. ప్రమాదస్థలాన్ని శనివారం ఎమ్మెల్యే విజయరమణారావు పరిశీలించారు. పౌరసరఫరాలశాఖ అధికారి ప్రేమ్‌కుమార్ మిల్లును సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

'పిన్' లేక పని చేయని జనరేటర్!



అత్యవసర పరిస్థితుల్లో సేవలందించేందుకు అవసరమయ్యే పరికరాలు మొరాయిస్తే.. సమయానికి పనికి రాక సేవలందని పరిస్థితి నెలకొంటుంది. భోజన్నపేట రైస్‌మిల్లులో చెలరేగిన మంటలను అదుపు చేసేందుకు వచ్చిన పెద్దపల్లి ఫైరింజన్ వద్ద శుక్రవారం రాత్రి ఇదే పరిస్థితి ఎదురైంది. ఫైరింజన్‌లో నీళ్లు అయిపోవడంతో సమీపంలోని చెరువు నుంచి నీరు తోడేందుకు జనరేటర్ సాయంతో ఫైర్ సిబ్బంది యత్నించారు. అయితే జనరేటర్‌కు పిన్ లేకపోవడం తో నీరు నిండడం లేదని గోదావరిఖనిలో ఉన్న పెద్దపల్లి ఫైర్ ఆఫీసర్ రాజేందర్‌కు సిబ్బంది సమాచారం అందించారు. అప్పటికే మిల్లులో కొంత మేర మంటలు అదుపులోకి వచ్చినా సకాలంలో నీరందక మళ్లీ ఎక్కువ కావడంతో యజమానితో పాటు స్థానికులు హైరానా పడ్డారు. గోదావరిఖని నుంచి మరో ఫైరింజన్‌ను తెప్పించగా.. ఆ యంత్రానికి సంబంధించిన జనరేటర్ సాయంతో నీరు నింపి రెండు ఫైరింజన్ల సాయంతో మంటలు అదుపు చేశారు. యంత్రాల్లో సాంకేతిక లోపాలు తలెత్తడం సహజమని, వాటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నష్టం కలగకుండా చర్యలు తీసుకున్నామని పెద్దపల్లి అగ్నిమాపక శాఖ అధికారి రాజేందర్ తెలిపారు.

20న బీటెక్ సీట్ల కౌన్సెలింగ్


రామగిరి(మంథని): సెంటనరీకాలనీలోని మంథని జేఎన్టీయూలో 2024–25 సంవత్సరానికి కేటాయించిన సూపర్ న్యూమరరీ బీటెక్ సీట్ల కౌన్సెలింగ్ ఈనెల 20న చేపడతామని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు తెలిపారు. తొలిదశలో మిగిలిన 25 సీట్లు, కొత్తగూడెంలోని కాకతీయ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో మిగిలిన 10 సూపర్ న్యూమరరీ సీట్లకు ఈనెల 22న అక్కడే ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. మెరిట్ ప్రతిపాదికన సింగరేణి అధికారులు, ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగుల పిల్లలకు కేటాయిస్తారని వివరించారు. అర్హత గలవారు ధ్రువీకరణపత్రాలతో నిర్దేశిత సమయానికి కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని వారు సూచించారు.

మోటార్ స్టార్టర్ బాక్సులు చోరీ

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): పాలకుర్తి మండలం ఎల్కలపల్లి గ్రామంలో బండారి ప్రసాద్‌కు చెందిన వ్యవసాయ పంపుసెట్ మోటార్ స్టార్టర్ బాక్సులను దొంగలు చోరీ చేశారు. శనివారం బాధితుడు ఎన్టీపీసీ ఠాణాలో ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వారం వ్యవధిలో తండ్రీకొడుకు మృతి

- గంభీర్‌పూర్‌లో విషాదం



రాజం(ఫైల్)



రమేశ్(ఫైల్)

కథలాపూర్(వేములవాడ): జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామంలో వారం రోజుల వ్యవధిలోనే తండ్రీకొడుకు మృతిచెందడంతో బాధిత కుటుంబం కన్నీటిపర్యంతం కాగా.. శనివారం గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గంభీర్‌పూర్‌కు చెందిన గండిగ రాజం(68)కు ముగ్గురు కుమారులు. రాజం ఈనెల 10న అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో దుబాయిలో ఉంటున్న అతని రెండో కుమారుడు గండిగ రమేశ్‌కు సమాచారం అందించారు. ఈక్రమంలో రమేశ్ హుటాహుటిన స్వగ్రామానికి చేరుకొని తండ్రి అంత్యక్రియలకు హాజరయ్యాడు. ఆప్యాయంగా పెంచి పోషించిన తండ్రిని కోల్పోయానని రమేశ్ బంధువులతో చెబుతూ బాధపడ్డాడు. ఈనెల 16న సాయంత్రం రమేశ్ ఛాతిలో నొప్పి ఉందని కుటుంబసభ్యులకు చెప్పాడు. చికిత్స నిమిత్తం కోరుట్ల ఆసుపత్రికి తరలించారు. రమేశ్‌కు గుండె సంబంధిత సమస్య ఉన్నట్లు గుర్తించిన వైద్యులు కరీంనగర్‌కు తరలించాలని కుటుంబసభ్యులకు సూచించారు. చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

'శ్రావణ' ఉత్సాహం



పెద్దపల్లిరూరల్: స్థానిక ట్రినిటి డిగ్రీ కాలేజీలో శనివారం విద్యార్థినులు సంప్రదాయ దుస్తులతో అలరించారు. శ్రావణ మాసంలో మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి వరలక్ష్మి, గౌరీదేవిలకు పూజలు ఎలా చేస్తారో ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపకులు అశ్విని, సరిత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మంథని: సిద్దపల్లి వద్ద రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు. మంథని నుంచి అక్రమంగా బియ్యం రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీ చేయగా ఐదు క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి.





వేములవాడ: వేములవాడ రాజన్నకు వీకెండ్ తాకిడి పెరిగింది. శ్రావణమాసంలో శని త్రయోదశి కలిసి రావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు శనివారం వేలాదిగా తరలివచ్చారు. మధ్యాహ్నం 2.30 గంటలకు స్వామివారికి నివేదన ఉండటంతో అభిషేకాలు చేసే అవకాశం లభించింది.

పండుగకు పంపించకపోవడంపై ఆందోళన



రోడ్డుపై బైఠాయించిన తల్లిదండ్రులు

మెట్‌పల్లి(కోరుట్ల): తమ పిల్లలను రాఖీ పండుగకు ఇంటికి పంపించకపోవడాన్ని నిరసిస్తూ పట్టణంలో మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల ఎదుట శనివారం తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. సోమవారం రాఖీ పండుగ ఉండడంతో పిల్లలను తీసుకెళ్లేందుకు పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చారు. కానీ, ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడం వల్ల వారిని ఇంటికి పంపడానికి ప్రిన్సిపాల్ జుబేర్ నిరాకరించాడు. దీంతో తల్లిదండ్రులు పాఠశాల ఎదుట రహదారిపై బైఠాయించారు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు అక్కడకు చేరుకొని ప్రిన్సిపాల్‌తో మాట్లాడుకోవాలే తప్ప ఇలా ఆందోళనలు చేయడం సరికాదని నచ్చజెప్పారు. అనంతరం ప్రిన్సిపాల్ వద్దకు మరోసారి వెళ్లగా, ఆయన పరిస్థితిని వివరించి సహకరించాలని కోరారు. దీనికి కొందరు అంగీకరించి అక్కడి నుంచి వెళ్లిపోగా, మరికొందరు తల్లిదండ్రులు మాత్రం పంపించాల్సిందేనని పట్టుబట్టారు. గత్యంతరం లేక అలాంటి వారి పిల్లలను పంపించడంతో వివాదం సద్దుమణిగింది.

కట్టు కథ అల్లి.. తప్పుదారి పట్టించి

- మిస్సింగ్ కథ నడిపించిన యువకుడిపై కేసు



గంగరాజు అరెస్టు చూపుతున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్

చందుర్తి(వేములవాడ): కట్టు కథ అల్లి పోలీసులను తప్పుదారి పట్టించిన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎక్కలదేవి గంగరాజును పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం రాత్రి చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. ఈ నెల 15న తెల్లవారుజామున 4గంటల సమయంలో పొలం వద్దకు వెళ్లిన గంగరాజు అక్కడ బైక్‌ను ధ్వంసం చేసి సెల్‌ఫోన్, చెప్పులు చిందరవందరగా పడేసి, చేతిని రాళ్లతో గీరుకుని షర్టుకు రక్తపు మరక అంటించి పడేశాడు. దీనిని నిజమని నమ్మించేందుకు తన భార్య గంగజలతో «నా భర్త కనిపించడంలేదు» అని ఫిర్యాదు చేయించాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా దాడి చేసిన ఆనవాళ్లు తప్ప గంగరాజు ఆచూకీ డ్వాగ్ స్క్వాడ్‌తో వెతికినా గురువారం రాత్రి లభ్యం కాలేదు. శుక్రవారం వేకువజామున ఆశిరెడ్డిపల్లె శివారులో తాళ్లతో బంధించి ఉన్న గంగరాజును పోలీసులు గుర్తించారు. అతడిని వైద్య పరీక్షల నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శుక్రవారం రాత్రి విచారించగా తన చిన్నాన్న ఎక్కలదేవి రాజయ్యతో ఉన్న వివాదాలతో తరుచూ గొడవలు జరుగుతున్నాయని, ఇప్పటికే రెండు కేసులు ఉండడంతో తాను ఇబ్బందులు పడుతున్నట్లుగానే, తన చిన్నాన్నతోపాటు అతడి ఇద్దరు కుమారులపై క్రిమినల్ కేసు నమోదు చేయించాలని తనను కిడ్నాప్ చేసినట్లు కట్టుకథ అల్లినట్లు గంగరాజు ఒప్పుకున్నాడు. పోలీసులను తప్పుదారి పట్టించిన గంగరాజుపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు. ఈ సమావేశంలో చందుర్తి ఎస్సై శ్రీకాంత్, కానిస్టేబుల్స్ ఉన్నారు. కాగా పోలీసులు మాత్రం శుక్రవారం రాత్రి ఈ వ్యవహారంలో సంబంధం ఉందన్న అనుమానంతో మరికొందరిని అదుపులోకి తీసుకుని వదిలేసినట్లు తెలిసింది.